క్లుప్తంగా

21న బండ్లమ్మ ఆలయంలో అన్నదానం

పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో ఈ నెల 21న అన్న సంతర్పణ జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఘంటసాల నరసింహమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి భక్తులు, దాతల సహకారంతో అన్న సంతర్పణ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని తెలిపారు.

వీరాంజనేయ స్వామికి పల్లకీ సేవ

జంపని(వేమూరు): జంపని గ్రామంలోని వీరాంజనేయ స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామికి పంచామృత అభిషేకం, మన్యు సూక్త పారాయణ జరిపారు. సాయంత్రం నాదెండ్ల సురేష్ బాబు, ఎక్కల చిన్న సుబ్రహ్మణ్యం దంపతులు పల్లకీ ఉత్సవాని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ

వేమూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల 16వ విడత సామాజిక తనిఖీ మంగళవారం నుంచి చేపట్టడం జరుగుతుందని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సునీత తెలిపారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం సామాజిక తనిఖీ బృందంతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలో 2021–22 ఆర్థిక సంవత్సరం జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా చేసిన పనులను సామాజిక తనిఖీ చేయడం జరుగుతుందని చెప్పారు.

మల్లేశ్వరస్వామి దేవస్థానం హుండీ లెక్కింపు రేపు

భట్టిప్రోలు: భట్టిప్రోలులోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానం హుండీ లెక్కింపు బుధవారం ఉదయం 10:30 గంటలకు నిర్వహించనున్నట్లు ఈఓ దివి వేంకట అప్పలాచార్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ఆవరణలో..దేవాదాయ శాఖాధికారులు, ధర్మకర్తలు, గ్రామ పెద్దలు, భక్తుల సమక్షంలో హుండీ లెక్కింపు జరుగుతుందని పేర్కొన్నారు.

12న సర్వసభ్య సమావేశం

చుండూరు(వేమూరు): మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం 12న సాయంత్రం 3 గంటలకు నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీఓ సుగుణమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ జాలాది రూబేను అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని పేర్కొన్నారు.

ఉపాధి పనులు ప్రారంభం



పెదపులివర్రు(భట్టిప్రోలు): పెద పులివర్రులో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను సోమవారం ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి ప్రారంభించారు. ఉపాధి కూలీలకు పని వేళల్లో సౌకర్యాలు కల్పించాలని ఎంపీపీ సిబ్బందికి స్పష్టం చేశారు. ఈకేవైసీ చేయించి, పోస్టాఫీస్‌లో ఖాతా ప్రారంభించాలని సూచించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు కె.నాగశ్రీ, కె.ఏసుపాదం, వి.నాగేశ్వరరావు, వి.రవికుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు దావూరి నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

రేపల్లె రూరల్: పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన పేటేరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులను స్థానిక సచివాలయంలో సర్పంచ్ కనపర్తి వసుమతి, సచివాలయ ఉద్యోగులు అభినందించారు. ఉత్తమ ఉత్తీర్ణత సాధించిన జక్కా యశ్వంత్, కొండా లోకేష్, మల్లిపెద్ది శ్రావ్య, గుద్దంటి హేమంత్‌కుమార్‌కు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సత్యవతి, మాజీ ఎంపీటీసీ రావు ప్రభాకరరావు, సెక్రటరీ పుష్పకుమార్, వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌చార్జ్ కనపర్తి రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కట్నం వేధింపులపై కేసు నమోదు

తెనాలి రూరల్: కట్నం వేధింపులపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని చినరావూరుకు చెందిన సాయిప్రసన్నకు కృష్ణాజిల్లాకు చెందిన లక్ష్మయ్యతో వివాహమైంది. ఇటీవల భర్త కట్నం కోసం వేధిస్తున్నాడని ఆమె సోమవారం వన్‌టౌన్ పోలీసుల్ని ఆశ్రయించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం

తెనాలి రూరల్: వివాహిత అదృశ్యంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ ముత్తెంశెట్టిపాలేనికి వివాహిత గంటినపల్లి స్వరూప (32) ఆదివారం ఇంటి నుంచి వెళ్లిపోయింది. గాలించినా ఫలితం లేకపోవడంతో భర్త వన్‌టౌన్ పోలీసుల్ని ఆశ్రయించారు. సోమవారం రాత్రి కేసు నమోదు చేశారు.

మరమ్మతుల మాసం..

- నిషేధంతో చేపల వేటకు బ్రేక్..
- ఒడ్డుకు చేరిన బోట్లు
- మరమ్మతులతో హార్బర్ ప్రాంతంలో పనుల సందడి



నిజాంపట్నం శివారు ప్రాంతంలో బోటు మరమ్మతులు



బోటు విడిభాగాల రిపేరు పనుల్లో నిమగ్నమైన కార్మికులు

రేపల్లె: సముద్రపు వేటకు విరామం ప్రకటించడంతో.. బోట్లు మరమ్మతుల నిమిత్తం ఒడ్డుకు చేరాయి. పనులతో హార్బర్‌లో సందడి వాతావరణం నెలకొంది. ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు సముద్రపు వేటకు ప్రభుత్వం నిషేధం విధించింది. హార్బర్‌తో పాటు క్రీక్ (పాయ) ద్వారా నిజాంపట్నం, గోకర్ణమఠం శివారు ప్రాంతాలకు బోట్లను యజమానులు మరమ్మతుల కోసం తరలిస్తున్నారు. కార్పెంటింగ్, కొత్త రంగులు దిద్దుతూ.. మళ్లీ చేపల వేటకు బోట్లను సిద్ధం చేస్తున్నారు. నిజాంపట్నం హార్బర్‌లో 203 మెకనైజ్డ్ బోట్లు, మోటరైజ్డ్ బోట్లు 707, రేపల్లె మండలంలో మోటరైజ్డ్ బోట్లు 484 ఉన్నాయి.

పుష్కలంగా పనులు



వేట నిషేధ సమయంలో పనులు పుష్కలంగా ఉంటాయి. రెండు నెలల్లో బోట్లను రిపేరు చేయించటం జరుగుతుంది. దీంతో పనులు పూర్తి స్థాయిలో పనులు ఉంటాయి.

–కె.కిషోర్, కార్పెంటర్, నిజాంపట్నం

రెండు నెలలూ ఖాళీ ఉండదు..



బోట్లు, పడవల మరమ్మతులు రెండు నెలలు పూర్తిస్థాయిలో ఉంటాయి. బోట్లను ఒడ్డుకు చేర్చి, మరమ్మతులు నిర్వహిస్తుంటారు. వేట నిషేధం పూర్తయ్యే వరకు పనులు ఉంటాయి. మిగిలిన రోజులు తక్కువగా ఉంటాయి.

–బొమ్మిడి మోహన్, కొలిమి కార్మికుడు, నిజాంపట్నం

ఘనంగా రెడ్‌క్రాస్ వ్యవస్థాపక దినోత్సవం



డ్యునాంట్ చిత్రపటానికి నివాళి..



కర్లపాలెంలో నివాళులర్పించిన తహసీల్దారు



పారిశుద్ధ్య కార్మికులకు ఆప్రాన్‌లను అందజేత

రేపల్లె రూరల్: సమాజంలో ప్రతి ఒక్కరూ ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రేపల్లె బ్రాంచ్ చైర్మన్ డాక్టర్ వసంతం వీర రాఘవయ్య అన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ వ్యవస్థాపకుడు హెన్రీ డ్యునాంట్ జయంతి సందర్భంగా.. ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని పట్టణంలోని బ్లడ్ బ్యాంక్ భవనంలో సోమవారం నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆయన పాల్గొని, మాట్లాడారు. రెడ్‌క్రాస్ అంతర్జాతీయంగా చేస్తున్న సేవా కార్యక్రమాలు అద్వితీయమన్నారు.హెన్రీ డ్యునాంట్ చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సేవలు అమోఘం..

కర్లపాలెం: రెడ్‌క్రాస్ సేవలు అమోఘమని తహసీల్దారు కేశవ నారాయణరావు పేర్కొన్నారు. రెడ్‌క్రాస్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సోమవారం రెడ్ క్రాస్ వ్యవస్థాపకుడు హెన్రీ డ్యునాంట్ చిత్ర పటానికి రెడ్ క్రాస్ మండల చైర్మన్ ఇనకొల్లు పోలీస్‌రావుతో కలిసి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సంస్థ ఉపాధ్యక్షుడు మందపాటి పరమానంద కుమార్, హౌసింగ్ ఏఈ అన్వర్ బాషా, సభ్యులు పాల్గొన్నారు.

పేదలను ఆదుకోవడంలో..

నిజాంపట్నం: పేదలను ఆదుకోవడంలో రెడ్‌క్రాస్ ఎప్పుడూ ముందుంటుందని నిజాంపట్నం సొసైటీ చైర్మన్ గౌరీశంకర్ పేర్కొన్నారు. ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా సోమవారం నిజాంపట్నం, మొల్లగుంట గ్రామ పంచాయతీల పారిశుద్ధ్య కార్మికులకు ఆప్రాన్(పైనవేసుకునే చొక్కా)లను అందించారు. కార్యదర్శి అజయ్‌కుమార్, సొసైటీ ప్రతినిధులు బాబ్జీ, బసవరాజు పాల్గొన్నారు.

ఇలా అయితే.. ఎలా వెళ్లాలి..!



భట్టిప్రోలు ప్రధాన రహదారికి అడ్డంగా ఆవుల మంద

భట్టిప్రోలు: ఆవుల యజమానుల నిర్లక్ష్యం వాహనదారులకు ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. భట్టిప్రోలు ప్రధాన రహదారుల్లో అడ్డంగా ఆవుల మంద చేరి.. వాహన రాకపోకలను అడ్డుకుంటున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపైనే అడ్డంగా పడుకుండిపోవడంతో.. వాటిని అదిలించ లేక ఇక్కట్లు అవస్థలు పడుతున్నారు. అసలే ఇరుకు రోడ్లు.. ఆపై గోవుల మందతో.. రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. ఆవులను తప్పించి వాహనాలు వెళుతున్న సమయంలో అవి కొమ్ములు విసిరి పొడిచేందుకు వస్తుండటంతో.. వాహనదారులు, పాదచారులు హడలిపోతున్నారు. యజమానులు రోడ్లపైకి ఆవులను యథేచ్ఛగా వదిలేయడంతో.. ప్రమాదాలూ చోటు చేసుకుంటున్నాయి. ఆవులను రోడ్లపైకి వదలకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ సమస్యపై స్పందించిన పంచాయతీ కార్యదర్శి కోట శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఆవుల యజమానులతో మాట్లాడుతామన్నారు. పరిస్థితిని వివరించి, సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

హనుమత్ జయంతి వేడుకలకు సన్నద్ధం



పదమటిపాలెం(భట్టిప్రోలు): కోనేటిపురం పంచాయతీ పరిధిలోని పడమటిపాలెంలో కొలువైన సుందరాంజనేయ స్వామి దేవాలయంలో ఈ నెల 14న హనుమత్ జయంతి వేడుకలు నిర్వహించేందుకు సన్నద్ధం చేస్తున్నారు. దేవాలయ మేనేజింగ్ ట్రస్టీ, విశ్రాంత ఐఏఎస్ అధికారి పడమటి సుందర కుమార్ 2008లో స్వామి వారి 33 అడుగుల ఎత్తుగల విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. గ్రామస్తుల కోరిక మేరకు దేవాలయాన్ని కూడా నిర్మించారు. భట్టిప్రోలు బస్టాండ్ సెంటర్‌లో నూతనంగా నిర్మించిన అభయాంజనేయస్వామి దేవాలయంలో ఈ నెల 14న హనుమత్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు, అన్న సంతర్పణ కార్యక్రమాలు జరుగుతాయని దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న శంకరరావు

నిజాంపట్నం: బొర్రావారిపాలెంలో సోమవారం బీసీ సంక్షేమ సంఘం రేపల్లె నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు మాట్లాడుతూ బీసీల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. నియోజికవర్గ స్థాయి కమిటీ నేతల మార్పులపై చర్చించారు. త్వరలోనే తమ పార్టీ పేరును ప్రకటిస్తామని చెప్పారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్, జిల్లా గౌరవాధ్యక్షుడు మద్ది బోయిన తాతయ్య, న్యాయ సలహాదారు నటరాజన్, నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు బడుగు వెంకట నారాయణ, పట్టణాధ్యక్షుడు లంకేశ్వరరావు, నిజాంపట్నం అధ్యక్షుడు నాగబాబు, బాలకోటేశ్వరరావు పాల్గొన్నారు.

మేళాకు 120 మంది హాజరు

తెనాలి రూరల్: తెనాలి జగ్గడిగుంటపాలెంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ)లో సోమవారం ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్ మేళా నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన 12 కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. తమకు అవసరమైన విద్యార్థుల్ని ఎంపిక చేసుకున్నారు. మేళాకు 120 మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమాన్ని శిక్షణా సంస్థ ప్రిన్సిపాల్ రావి చిన వెంకటేశ్వర్లు, సిబ్బంది పర్యవేక్షించారు.

లూథరన్ దేవాలయంలో బైబిల్ క్లాసులు



బైబిల్ క్లాసులకు హాజరైన చిన్నారులు

భట్టిప్రోలు: భట్టిప్రోలులోని క్రీస్తు లూథరన్ దేవాలయంలో క్రైస్తవ బాల బాలికలకు చిల్డ్రన్స్ బైబిల్ క్లబ్(సీబీసీ) క్లాసులు సోమవారం ప్రారంభమయ్యాయి. గురు మండల అధ్యక్షుడు, పాస్టర్ రెవరెండ్ దాసరి రవీంద్ర వర్మ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. క్రైస్తవ చిన్నారులు దేవుని మార్గంలో నడవాలంటే వారికి దైవ బోధనలు ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. ఏటా వేసవిలో చిన్నారులకు బైబిల్ క్లాసులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టరమ్మ దాసరి విజయ, సండే స్కూల్ టీచర్స్ పాల్గొన్నారు. క్రీస్తు లూథరన్ సంఘ పెద్దలు, స్త్రీల సమాజం, యూత్ సండే స్కూల్ చిల్డ్రన్స్, సంఘం సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

తడిసిన పంటలను ప్రభుత్వం కొనుగోలు చేయాలి



తెనాలి టౌన్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తడిసిన వాణిజ్య పంటల్ని ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని రైతు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రూరల్ మండలం గుడివాడ రైతు భరోసా కేంద్రంలో సిబ్బందికి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి ఆధ్వర్యంలో రైతులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాంబిరెడ్డి మాట్లాడుతూ అకాల వర్షం వల్ల కల్లాల్లోని పసుపు, మొక్కజొన్న, జొన్న పంటలు తడిసి పోయాయని తెలిపారు. పంట దెబ్బతినడంతో రైతులు నష్టపోయే ప్రమాదముందని, ప్రభుత్వం స్పందించి తడిసిన పంటల్ని కొనుగోలు చేయాలని కోరారు. గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్ని ఏర్పాటు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు ముద్దన సాంబశివరావు, తులాబంధుల ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

‘స్పందన’తో సమస్యలకు పరిష్కారం



అర్జీ ఇస్తున్న రైతు సంఘం నాయకులు

రేపల్లె: స్పందన కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను విన్నవించుకోవచ్చని ఆర్డీఓ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ అధికారి జాన్ పీటర్ పేర్కొన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం మూడు అర్జీలు అందాయని తెలిపారు. గతేడాది వచ్చిన తుపాను ప్రభావంతో లంక గ్రామాలు కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో అరటి, ఇతర పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం వెంటనే చెల్లించాలని ఏపీ రైతు సంఘం సభ్యులు వినతి పత్రం అందజేశారని చెప్పారు. నిజాంపట్నం మండలం ఆముదాలపల్లిలో శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని, 5వ వార్డులో స్థల సమస్యను పరిష్కరించాలని మరో అర్జీ అందినట్లు తెలిపారు. అర్జీలను పరిశీలించి, సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు.

గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వరప్రసాద్



శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సుబ్బారావు

బాపట్ల అర్బన్: బాపట్ల శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు సోమవారం సమ్మర్ క్యాంపు ప్రారంభించారు. ముఖ్య అతిథిగా రిటైర్డ్ సైంటిస్ట్ అందె మురళి వర ప్రసాద్ పాల్గొన్నారు. ఈయనకు డాక్టర్ అబ్దుల్ కలాం టీంలో పనిచేసిన అనుభవం ఉంది. ఈ సందర్భంగా అయ్యంకి వెంకట రమణయ్య, ఎస్ఆర్ రంగనాథన్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. సభకు గ్రంథాలయ అధికారి ఎ.శివాజీ గణేషన్ అధ్యక్షత వహించారు. వరప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు సమ్మర్ క్యాంపు ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. డాక్టర్ పీసీ సాయి బాబా, మల్లికార్జునరావు, జీవీ, జ్వాలారావు పాల్గొన్నారు.

శిబిరం ప్రారంభం

భట్టిప్రోలు: భట్టిప్రోలులోని మాటూరు రామారావు శాఖ గ్రంథాలయంలో సోమవారం వేసవి శిక్షణ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ దారా రవికిరణ్మయి ప్రారంభించారు. ఈ శిబిరం జూన్ 11వ తేదీ వరకు జరుగుతుందని గ్రంథాలయాధికారి కలపాల సుభాష్ చంద్రబోస్ తెలిపారు. శిబిరంలో 45 మంది విద్యార్థులు, పాఠకులు, విశ్రాంత ఉపాధ్యాయులు బొలిశెట్టి శ్రీనివాసరావు(బీఎస్సార్), రావూరి మురళి, దారా చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

కర్లపాలెంలో..

కర్లపాలెం: వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని కర్లపాలెం గ్రంథాలయాధికారిణి టీవీ రమణమ్మ పేర్కొన్నారు. వేసవి శిక్షణలో భాగంగా సోమవారం విద్యార్థులు, చిన్నారులు గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం చేశారు.

వేసవి శిబిరాలతో మేలు

కొల్లూరు : విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించే ధ్యేయంతో ప్రభుత్వం గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కొల్లూరు జెడ్పీటీసీ సభ్యుడు చొప్పర సుబ్బారావు అన్నారు. సోమవారం కొల్లూరు శాఖా గ్రంథాలయంలో శిక్షణ శిబిరం ప్రారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థుల సమక్షంలో సరస్వతీ దేవి విగ్రహానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కమ్మెల సాంబయ్య, గ్రంథాలయాధికారి వై.రాంబాబు పాల్గొన్నారు.

‘మొక్క’వోని సంకల్పం



దండిపార్వతి అమ్మవారి దేవాలయంలో గార్డెనింగ్ పనిలో..



మొక్క నాటుతున్న రాజారామ్



రాజమండ్రి కళాశాలలో క్రోటన్ మొక్కలతో కెమిస్ట్రీ అక్షర రూపం

- మొక్కలు నాటి సంరక్షిస్తున్న కళాశాల ఉద్యోగి
- మూడున్నర దశాబ్దాలుగా మొక్కల పెంపకం..
- పలువురికి ఆదర్శంగా రాజారామ్

భట్టిప్రోలు: చెట్లను బతకనిద్దాం.. మనం బతుకుదాం అంటున్నారు భట్టిప్రోలుకు చెందిన మద్దుల వెంకట రాజారామ్. స్థానిక డిగ్రీ కళాశాలలో అటెండర్‌గా పని చేసిన ఆయన తనకు వచ్చే జీతంలో కొంత భాగం మొక్కల పెంపకానికి ఖర్చు చేస్తూ.. వాటి ఆలనా పాలన చూస్తున్నారు. భట్టిప్రోలు వాసులకు మొక్కల ప్రేమికుడిగా సుపరిచితులైన రాజారామ్.. ప్రాణ వాయువుకు ప్రాణం పోస్తూ పలువురి మన్ననలు పొందుతున్నారు. గ్రామంలోని ప్రధాన కూడళ్లు, బస్టాండ్, వెల్లటూరు ఛానల్, బౌద్ధ స్థూపం, డిగ్రీ కళాశాల, రైల్వే స్టేషన్ ఇలా పలు చోట్ల ఆయన నాటిన మొక్కలే కనిపిస్తాయి. అపరిశుభ్రంగా ఉన్న స్థానిక గ్రామ దేవత దండి పార్వతి అమ్మవారి దేవాలయ పరిసరాల అభివృద్ధికి.. భట్టిప్రోలు ఫ్రెండ్స్ అసోసియేషన్ నడుం బిగించింది. రాజారామ్ దేవాలయ పరిసరాల్లో చెట్లు నాటి, గార్డెనింగ్‌ని తీర్చిదిద్దారు. అమ్మవారి పూజకు కావాల్సిన పూల మొక్కలనూ నాటారు. ఈ దేవాలయం ప్రస్తుతం పచ్చదనంతో పరిమళిస్తోంది. ప్రస్తుతం రాజమండ్రి ఆర్ట్స్ కళాశాలలో కెమిస్ట్రీ విభాగంలో రికార్డు అసిస్టెంటుగా పని చేస్తున్న రాజారామ్ అక్కడ కూడా మొక్కల పెంపకాన్ని చేపడుతున్నారు. ప్రాంగణంలో 5 గార్డెన్లను తీర్చిదిద్దారు. ఇందుకోసం భట్టిప్రోలు నుంచి మొక్కలను తీసుకెళ్తున్నారు. ఆయన సెలవులకు గ్రామానికి వచ్చినప్పుడు మొక్కల సంరక్షణకు అధిక సమయం కేటాయిస్తారు. మూడున్నర దశాబ్దాలుగా.. సుమారు 15 వేలకు పైగా మొక్కలు నాటారు. చుట్టు పక్కల ప్రాంతాలు వెల్లటూరు, సూరేపల్లి, కోడిపర్రు, తిప్పలకట్ట, వేమవరం తదితర గ్రామాల్లో మొక్కల పెంపకాన్ని విస్తృతం చేశారు. గత 35 ఏళ్లుగా మొక్కలు నాటుతున్నానని రాజారామ్ తెలిపారు. సమాజానికి ఉపయోగపడే పని ఏదో ఒకటి చేయాలనే తలంపుతో మొక్కల పెంపకాన్ని ఎంచుకున్నట్లు ఆయన వివరించారు. మొక్క నాటిన తర్వాత మూడేళ్ల పాటు దానిని సంరక్షించగలితే..చాలంటున్నారు ఆయన. తాను చేసిన సేవలకు గుర్తింపుగా వాసవీక్లబ్ ప్రకృతి మిత్ర పురస్కారాన్ని అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

వర్షాలకు కాలనీలు జలమయం



కొలకలూరు బీసీ కాలనీలో జలమయమైన రోడ్డు

తెనాలి టౌన్: అల్పపీడన ద్రోణి ప్రభావం వల్ల ఇటీవల ఐదు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు మండల గ్రామాల్లోని దళితవాడల్లో పల్లపు ప్రాంతాలు, బీసీ కాలనీల్లో రోడ్లు జలమయమయ్యాయి. కొలకలూరు బీసీ కాలనీలో జూబ్లీ స్కూలు పక్కన రోడ్డు వర్షం నీటితో మునిగిపోయింది. నీరు పారుదల కాకపోవడంతో ఇళ్లల్లోకి ప్రవేశించింది. మెయిన్ రోడ్డుకు ఇరువైపులా సైడు కాల్వల్లో నీరు రోడ్డు మీదుకు రావడంతో ఈ పరిస్థితి దాపురించింది. నందివెలుగు, హాఫ్‌పేట, కోపల్లె, గుడివాడ తదితర దళితవాడల్లో వర్షపునీరు చేరింది. అధికారులు స్పందించి నీటి పారుదలకు చర్యలు తీసుకోవాలని నివాసితులు కోరుతున్నారు.